

'న్యాయ పోరాట దీక్షకు తరలిరండి'

బెలగాం, ఫిబ్రవరి 10: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఈ నెల 15న న్యాయ పోరాట దీక్ష చేపట్టనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు తెలిపారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ దీక్షకు బాధితులంతా భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో చిన్న మదుపుదారులకు, ఆరు నెలల్లో బాధితులందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ నేడు మాట తప్పారన్నారు. దీనికి నిరసనగా న్యాయపోరాట దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు.

నేటి నుంచే శంఖారావం

- శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభం కానున్న నారా లోకేశ్ యాత్ర
- ప్రతిరోజు మూడు నియోజకవర్గాల్లో సభలు



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేశ్ చేపట్టనున్న 'శంఖారావం' యాత్రకు సర్వం సన్నద్ధమైంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఆదివారం ఈ యాత్ర ప్రారంభించి.. రాష్ట్రవ్యాప్తంగా 120 నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటించనున్నారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు.. అధికారంలోకి వచ్చాక కొనసాగిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించనున్నారు. యువగళం పాదయాత్ర భారీ స్థాయిలో ఇదివరకే జరిగిన విషయం తెలిసిందే. అనివార్య కారణాల వల్ల విశాఖతో ముగించి భోగాపురం మండలం పోలిపల్లిలో ముగింపు సభ నిర్వహించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో లోకేశ్ పర్యటించలేదు. ఈ నేపథ్యంలో పాదయాత్ర చేపట్టని నియోజకవర్గాల్లో తాజాగా శంఖారావం సభలు నిర్వహించనున్నారు. రోజూ మూడు నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారు. తొలిరోజున ఆదివారం ఇచ్ఛాపురంలో ఉదయం 10.30 గంటలకు కార్యకర్తలు, ప్రజలతో సభ నిర్వహిస్తారు.

ఇదీ షెడ్యూల్...

- 11న ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో సభలు నిర్వహిస్తారు.
- 12న నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో..
- 13న పాతపట్నం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో..
- 14న పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి నియోజకవర్గాల్లో ..
- 15న రాజాం, చీపురుపల్లి, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో..
- 16న నెల్లిమర్ల, విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాల్లో..
- 17న ఎస్.కోట, పెందుర్తి, భీమిలిలో..
- 18న విశాఖపట్నం తూర్పు, దక్షిణం, ఉత్తరంలో..
- 19న విశాఖపట్నం పశ్చిమం, గాజువాక, అనకాపల్లిలో
- 20న చోడవరం, వి.మాడుగుల, నర్సీపట్నంలో సభలు నిర్వహిస్తారు.
- 21న పాయకరావుపేటతో ఉత్తరాంధ్రలో శంఖారావం యాత్ర ముగుస్తుంది.



ఆసరా నిధులు పడలే!

- బటన్ నొక్కడంతో సరిపెట్టిన ప్రభుత్వం
- ఇంకా అకౌంట్లలో జమకాని మొత్తం
- మహిళా సంఘాల ఎదురుచూపు

(జియ్యమ్మవలస)

సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి సీఎం జగన్ బటన్ నొక్కడంతోనే సరిపెడుతున్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో మాత్రం వెంటనే ఆ సొమ్ము జమకావడం లేదు. దీంతో వారు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. తాజాగా ఆసరా పథకం విషయంలోనూ ఇదే జరిగింది. సీఎం బటన్ నొక్కి చాలా రోజులవుతున్నా.. నేటికీ ఇంకా మహిళా సంఘాల అకౌంట్లలో నగదు జమ కాలేదు. దీంతో వారు నిరాశ చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 15 మండలాలు, మూడు అర్బన్ కేంద్రాలకు గాను ఉన్న మొత్తం మహిళా సంఘాలు 19,800 వరకు ఉన్నాయి. వాటిల్లో ఈ ఏడాది 16,669 సంఘాలకు ఆసరా సొమ్ము అందించాల్సి ఉంది. కాగా 2020-21లో 15 మండలాల్లో 14,268 సంఘాలకు గాను రూ.78.18 కోట్లు, మూడు అర్బన్లలో 2,263 సంఘాలకు రూ. 15.34 కోట్లు అందించింది. రెండో విడత 2021-22లో 14,383 సంఘాలకు గాను రూ.78.73 కోట్లు, మూడు అర్బన్ కేంద్రాల్లో 2,263 సంఘాలకు రూ. 15.91 కోట్లు అందించారు. మూడో విడత 2022-23లో 14,401 సంఘాలకు రూ. 78.93 కోట్లు, మూడు అర్బన్ కేంద్రాల పరిధిలో 2,268 మహిళా సంఘాలకు గాను రూ. 16.97 కోట్లు ప్రభుత్వం అందించింది. ఈ మూడేళ్లలో సకాలంలో అందించిన ప్రభుత్వం ఈ ఏడాది మాత్రం జాప్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగో విడత పంపిణీ ఎన్నికల ప్రచారానికి ఉపయోగపడేలా వైసీపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. తదనుగుణంగా నియోజకవర్గాలవారీగా కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు. దాని ఆధారంగానే సమావేశాలు పూర్తి చేశారు. కానీ నేటికీ మహిళా సంఘాల అకౌంట్లకు నిధులు జమ కాలేదని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

2023-24 ఆర్థిక సంవత్సరం ఇలా..

వైఎస్ఆర్ ఆసరా పథకం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సీఎం జగన్ జనవరి 23న బటన్ నొక్కారు. తరువాత 24వ తేదీ నుంచి 31 వరకు ప్రతి మండలంలో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించిన వీడియోలు, పేపర్ క్లిప్పింగ్‌లు ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించేశారు కూడా. అయితే సమావేశాలు పూర్తయిన నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు వారి పొదుపు అకౌంట్లలో ఈనెల 1వ తేదీ నుంచి ఆసరా సొమ్ము జమ చేయాల్సి ఉంది. కానీ ఇప్పటికీ అకౌంట్లలో నగదు జమ కాలేదు. దీంతో మహిళా సంఘాలు ఆశగా ఎదురు చూస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 15 మండలాల పరిధిలో 14,401 సంఘాలకు రూ.78.80 కోట్లు, మూడు అర్బన్ కేంద్రాల పరిధిలో 2,263 సంఘాలకు రూ. 15.53 కోట్లు జమ కావాల్సి ఉంది. మరి ఎప్పుడు జమ చేస్తారో ప్రభుత్వానికే తెలియాలి.

కొద్ది రోజుల్లో...

వైఎస్ఆర్ ఆసరాకు సంబంధించి మహిళా సంఘాల పొదుపు ఖాతాల్లో 4వ విడత డబ్బులు మరికొద్ది రోజుల్లో పడనున్నాయి. దీనిపై మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

-పి.కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

డబ్బుల్లేవ్ జగనన్నా!



గొట్టివలసలో అంతంత మాత్రంగానే సురక్షకు హాజరైన ప్రజలు

- ఆరోగ్య సురక్షకు నిధుల కొరత
- సచివాలయాలకు జమ కాని మొత్తాలు
- అప్పులు చేసి శిబిరాల నిర్వహణ
- ఆందోళనలో కార్యదర్శులు
- మరోవైపు రోగుల నుంచి స్పందన కరువు

(గరుగుబిల్లి)

వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి నిధుల సమస్య వెంటాడుతోంది. సచివాలయలకు నిధులు జమ కావడం లేదు. దీంతో సిబ్బంది అప్పులు చేసి శిబిరాలను నిర్వహించాల్సి వస్తోంది. వాస్తవంగా మొదటి విడత కార్యక్రమానికే ప్రభుత్వం అరకొరగా నిధులు మంజూరు చేసింది. ఇంతలో రెండో విడతకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో గత నెల నుంచి శిబిరాలు నిర్వహిస్తుండగా.. నేటికీ నగదు కేటాయించలేదు. దీంతో సచివాలయ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి ఎన్నాళ్లు కార్యక్రమాలు నిర్వహిస్తామని మథనపడుతు న్నారు. మరోవైపు 'ఆరోగ్య సురక్ష' ప్రచారానికే పరిమితమవుతోంది. చాలా చోట్ల రోగుల నుంచి స్పందన కొరవడుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లా పరిధిలోని 15 మండలాలతో పాటు అర్బన్ ప్రాంతాల్లో గతంలో జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత కార్యక్రమం నిర్వహించారు. ప్రారంభంలో అట్టహాసంగా సచివాలయాల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. అయితే ఆరంభంలోనే సర్కారు అరకొరగా నిధులు మంజూరు చేయడంతో పలు సచివాలయాల కార్యదర్శులు అప్పులపాలయ్యారు. ఈ విషయం మరవక ముందే ఈ ఏడాది జనవరి 4వ తేదీ నుంచి పలు గ్రామాల్లో ఆరోగ్య సురక్ష రెండో విడతను ప్రారంభించారు.



సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న శిబిరాలకు ప్రభుత్వపరంగా ప్రత్యేకంగా మందులు అందించారు. మందులు సరఫరా, శిబిరాల నిర్వహణ బాధ్యతను సంబంధిత వైద్య సిబ్బందికి అప్పగించారు. అయితే ఆరోగ్య సురక్షకు సంబంధించి పూర్తిస్థాయిలో బాధ్యతలు, విధులు నిర్వహణ వైద్యులు, వైద్య సిబ్బందిపై ఉంది. కాగా నిధులు మంజూరు సచివాలయాలు, ఎంపీడీవోలకు, 'సేవలు వైద్య సిబ్బందికి' అన్న విధంగా సర్కారు వ్యవహరించింది. దీంతో 'సేవలు మేము అందించడం, సొమ్ములు వారికా?' అన్న అసంతృప్తి వైద్యశాఖలో ఉంది.

గతంలో ఇలా..

ఆరోగ్య సురక్ష నిర్వహణకు గతంలో సచివాలయానికి రూ. 40 వేలు అని ప్రకటించి రూ. 30 వేలు జమ చేశారు. మున్సిపాలిటీలకు రూ. 50 వేలు అని చెప్పి రూ. 40 వేలు జమ చేశారు. ప్రస్తుతం రెండో విడత ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నా నేటికీ నిధులు జమ కాలేదు. ముందుగా రూ. 10 వేలు చొప్పున అందిస్తామని ప్రకటించారు. నెల రోజులు గడుస్తున్నా నేటికీ ప్రకటించిన మొత్తాలు జమ కాలేదు. నిధులు సమస్య వెంటాడుతున్నా సంబంధిత సచివాలయ కార్యదర్శులు అప్పులు చేసి కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. విధులకు హాజరయ్యే వైద్యులు, సిబ్బందికి తాగునీరు, భోజన సౌకర్యం, టెంట్ల ఏర్పాటుతో పాటు పలు సేవల్లో అసౌకర్యం కలగకుండా చేస్తున్నారు. గతనెల 4న గరుగుబిల్లి మండలం బీవీ పురంలో, 11న నాగూరులో, 27న రాయిందొరవలసలో, ఈనెల 6న గొట్టివలసలో రెండో విడత ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఇలా పలు మండలాల్లో ఆరోగ్య సురక్ష నిర్వహించినా నిధులు జమ కాలేదు. కార్యక్రమం నిర్వహించి నెల గడిచినా నిధులు జమ కాకపోవడంతో సచివాలయ కార్యదర్శుల్లో అలజడి నెలకొంది. ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న సురక్ష ప్రచారానికే తప్ప ప్రజలకు ఉపయోగపడేదిగా లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రచార సామగ్రి తప్ప ఆరోగ్య సురక్షతో ఫలితాలు కానరావడం లేదనే వ్యాఖ్యలు సర్వత్రా విని పిస్తున్నాయి. మొత్తంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలకు స్పందన కరువైంది. రోగులు అంతంతమాత్రంగానే చేరుకోవడంతో అంతటా ఖాళీగానే దర్శమిస్తున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం..

ఆరోగ్య సురక్షకు సంబంధించి నిధుల మంజూరుపై ఉన్నతాధికారులకు నివేదించాం. ముందుగా కార్యక్రమం నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. నిధులు మంజూరు కాగానే ఆయా సచివాలయాలకు చెల్లింపులు జరుగుతాయి. నిధులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

-బి.జగన్నాథరావు, డీఎంహెచ్‌వో, పార్వతీపురం మన్యం

ఎన్నికల సిబ్బంది జాబితా సిద్ధం

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల సిబ్బంది జాబితాలు సిద్ధం చేశామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల సంసిద్ధత, శిక్షణ కార్యక్రమాలపై సమీక్షించారు. వివిధ విభాగాల కేంద్ర సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టాలని, వారికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన సూచించారు. కొత్తగా ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులకు వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఓటరు కార్డులు ఓటర్లుకు సకాలంలో పంపిణీ చేయాలని పోలింగ్ కేంద్రాల్లో వసతులు, బందోబస్తు, వాహనాలు తదితర ఏర్పాట్ల శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. సెక్టార్ అధికారులు, ఇతర విభాగాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల పనులు వారం రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఆర్.గోవిందరావు, సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనా కుమారి, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు, పాలకొండ, పార్వతీపురం ఆర్డీవోలు వెంకటరమణ, హేమలత తదితరులున్నారు.

గుంతలో దిగి.. అదుపు తప్పి

- ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు
- ఒకరు మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు



సుగ్రీవులు (ఫైల్)



నుజ్జునుజ్జయిన వాహనాలు




ప్రమాదానికి కారణమైన రోడ్డుపై భారీ గుంత

భామిని: రోడ్డుపై భారీ గుంత ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ముగ్గురిని గాయాలపాల్జేసింది. ఓ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఈ ఘటన శనివారం సాయంత్రం గురండి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తూరు నుంచి బత్తిలి వైపు వస్తున్న ఓ కారు నేరడి బ్యారేజీ సమీపంలోని రోడ్డుపై భారీ గుంతలో దిగి..ఒక్కసారిగా అదుపు తప్పింది. ఇదే సమయంలో ఎదురుగా బత్తిలి నుంచి గురండి వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను అది ఢీ కొట్టింది. దీంతో ఒక బైక్‌పై ఉన్న పి. సుగ్రీవులు (50), ఆయన భార్య శ్రీదేవి, మరో ద్విచక్ర వాహనంపై ఉన్న పి.మధు, ఆయన సతీమణి ఈశ్వరి రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డారు. కారుతో పాటు బైక్‌లు కూడా నుజ్జునుజ్జయ్యాయి. అయితే కారులో ఉన్న డ్రైవర్‌కు ఎటువంటి గాయాలవ్వలేదు. రెప్పపాటులో జరిగిన ఈ ఘటనతో స్థానికులు, వాహనదారులు, అక్కడి సమీపంలోని పొలంలో ఉన్న రైతులు షాక్‌కు గురయ్యారు. రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులను చూసి వెంటనే 108కు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న ఆ వాహన సహాయంతో వారిని భామిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే సుగ్రీవులు మృతి చెందారు. ఆయన భార్య శ్రీదేవి, మరో బైక్‌పై ఉన్న దంపతులు మధు, ఈశ్వరికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం సీతంపేట ఆసుపత్రికి రిఫర్ చేశారు. వారి పరిస్థితి మెరుగవకపోవడంతో చివరకు పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి బత్తిలి పోలీసులు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో బాధితుల స్వగ్రామం గురండిలో విషాదం నెలకొంది. వాస్తవంగా ఈ రెండు కుటుంబాలు ఉపాధి కోసం రాజమండ్రి వెళ్లాయి. బంధువుల ఇంటిలో వివాహం కోసమని వారు ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. అయితే పెళ్లి కబుర్లు చెప్పి కొన్ని సామాన్లు కొందామని శనివారం వారు బత్తిలి వెళ్లారు. అక్కడి నుంచి సాయంత్రం స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యారు. మరికొద్ది క్షణాల్లో స్వగ్రామానికి చేరుకుంటారనగా ఈ ఘటన జరగడంతో సుగ్రీవుల ఇద్దరు కుమారులు, బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు.

భూ తగాదాకు నిండు ప్రాణం బలి

- తమ్ముడిని హతమార్చిన అన్న
- గడివలసలో ఘటన
- విషాదంలో కుటుంబ సభ్యులు



జోగేశ్వరరావు (ఫైల్)

పాచిపెంట, ఫిబ్రవరి 10: వారిద్దరు వరుసకు అన్నదమ్ములు. రెండు కుటుంబాల మధ్య ఎప్పటి నుంచో భూ తగాదాలు ఉన్నాయి. అవి రోజురోజుకు తీవ్రమయ్యాయి. చివరకు అన్న చేతిలో తమ్ముడు హతమయ్యాడు. ఈ విషాదకర ఘటన శనివారం పాచిపెంట మండలం గడివలస సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

గ్రామానికి చెందిన కోరాడ జోగేశ్వరరావు (45), కోరాడ నరసింహులకు వ్యవసాయమే ఆధారం. వారిద్దరు పెదనాన్న, చిన్నాన్న పిల్లలు. వరుసకు అన్నదమ్ములు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే రెండు కుటుంబాల మధ్య గత ఎనిమిదేళ్లుగా భూములకు సంబంధించి గొడవలు జరుగుతున్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ అవి మరింత ముదిరాయి. వివాదాలు తారస్థాయికి చేరాయి. ఇరువురి మధ్య కక్షలు కూడా పెరిగాయి. గ్రామంలో పెద్ద మనుషుల వద్దకు వారి పంచాయితీ వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. చివరకు జోగేశ్వరరావు కోర్టును ఆశ్రయించాడు. కాగా రోజూలానే శనివారం కూడా పొలానికి వెళ్లిన జోగేశ్వరరావు యథావిధిగా పనుల్లో నిమగ్నమయ్యాడు. ఇంతలో కోరాడ నరసింహులు తమ్ముడు జోగేశ్వరరావు పీకను కొడవలితో కోసేశాడు. దీంతో జోగేశ్వరరావు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వారంతా హుటాహుటిన పొలానికి చేరుకున్నారు. విగతజీవిగా పడి ఉన్న జోగేశ్వరరావును చూసి భోరున విలపించారు. ఇక తమకు దిక్కెవరు అంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఇదిలా ఉండగా మృతుడి భార్య, కూతురు, కొడుకు అందించిన సమాచారం మేరకు సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ, ఎస్ఐ పి.నారాయణరావు, సిబ్బంది, క్లూస్ టీం హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పరిశీలించారు. హత్య జరిగిన ప్రదేశంలో ప్రధాన నిందితుడితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నట్టుగా గుర్తించారు. స్థానికులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. జోగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చలో అసెంబ్లీపై నిర్బంధం

- ఏఐవైఎఫ్ నాయకుల హౌస్ అరెస్ట్
- ప్రభుత్వం తీరుపై ప్రజా సంఘాల నేతల మండిపాటు



గృహ నిర్బంధంలో ఏఐవైఎఫ్‌నేత బీటీ నాయుడు

బెలగాం, ఫిబ్రవరి 10 : వైసీపీ సర్కారు తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. ఆదివారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన ఏఐవైఎఫ్ నాయకులను జిల్లా పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడికక్కడే నిర్బంధించారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం మండలం పుట్టూరులో ఏఐవైఎఫ్ నాయకుడు బీటీ నాయుడు ఇంటికి పోలీసులు చేరుకుని ఆయన్ని హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా పార్వతీపురం పట్టణంలో మరో ఏఐవైఎఫ్ నేత సింహాద్రి కిరణ్‌కుమార్‌ను కూడా గృహ నిర్బంధం చేశారు. దీనిపై ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చలో అసెంబ్లీకి పిలుపునిస్తే.. ఈ విధంగా సర్కారు వ్యవహరించడం తగదన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 25 వేల పోస్టులు ఉంటే వైసీపీ ప్రభుత్వం 6,100 పోస్టులకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. పూర్తి స్థాయిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, వయో పరిమితి పెంచాలని వారు డిమాండ్ చేశారు. మొత్తంగా నాలున్నరేళ్ల తర్వాత మెగా డీఎస్సీ వస్తుందని ఎదురుచూసిన వారికి సర్కారు నిరాశకు గురిచేసిందన్నారు. ఇది కేవలం ఎన్నికల డీఎస్సీగా ఉందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని ఏఐవైఎఫ్ నేతలు హెచ్చరించారు.



పోలీసు అదుపులో మరో నేత సింహాద్రి కిరణ్‌కుమార్

నేలబావిలో పడి ఒకరి మృతి



రామారావు (ఫైల్)

బాడంగి: మండలంలోని పూడివలసకు చెందిన దామోదరపాత్రో రామారావు (65) ప్రమాదవశాత్తు కాలు జారి పొలంలోని నేలబావిలో పడి మృతిచెందినట్లు ఎస్ఐ జయంతి తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. విశాఖలోని మల్కాపురంలో భార్య కళావతితో రామారావు నివాసముంటున్నాడు. వీరి ఇద్దరి కుమార్తెలు లక్ష్మి, శిరీషలకు వివాహంజరిగింది. శనివారం సొంత గ్రామం పూడివలస వెళ్లి అడ్డతో వలో పొలాల్లో వస్తుండగా ప్రమాదవశాత్తు నేలబావిలో పడి మృతిచెందాడు. బావి యజమాని నీరుతోడుతుండగా రామారావు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు సంఘటనా స్థలానికి ఎస్ఐ సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి ఆసుపత్రికి తరలించారు. రామారావు అన్న కుమారుడు ప్రతాపరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

మద్యం సీసాలు స్వాధీనం

కొత్తవలస: మండలంలోని దేవాడ పంచాయతీ కోనమశివానిపాలెంలో నిర్వహించిన దాడుల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన విజయ్ బెల్ట్‌షాపు ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశారని చెప్పారు. ఈ మేరకు 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● **రాజాం:** సంతకవిటి మండలం మండాకురిటికి చెందిన సారిపల్లి మన్మథరావు అక్రమంగా తరలిస్తున్న 130 మద్యం సీసాలను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం షాపు నుంచి తరలిస్తున్న విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో దారికాచి పట్టుకున్నారు. గ్రామంలో మన్మథరావు బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేశారు. దాడిలో ఏఎస్ఐ ముద్దూరు వాసుదేవరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

10 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తవలస: మండలంలోని చినమన్నిపాలెంశివారు ప్రాంతాల్లో శనివారం వంటసారా తయారీకి సంబంధించిన స్థావరాలపై దాడులు నిర్వహించి పది వేల లీటర్ల బెల్లం ఊట స్వాధీనంచేసుకుని ధ్వంసం చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సిబ్బందితో చినమన్నిపాలెం పరిసరాల్లోని తోటలు, కొండలపై సోదాలను నిర్వహించినట్లు చెప్పారు. వంటసారా తయారీ కోసం ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వఉంచిన బెల్లం ఊట గుర్తించినట్లు చెప్పారు. బెల్లం ఊట ఎవరదన్న విషయంపై దర్యాప్తు చేసి నిందితులపై కేసు నమోదుచేస్తామని తెలిపారు.

కానిస్టేబుల్ భార్య ఆత్మాహత్యాయత్నం

బెలగాం: ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్యాహత్నం చేసుకున్న ఘటన శనివారం పార్వతీపురంలో చోటుచేసుకుంది. పార్వతీపురం పట్టణంలో ఎస్పీఎఫ్‌కానిస్టేబుల్ భార్య ఎలుకల మందుతాగి ఆత్మహత్యాహత్నం చేసుకుంది. విషయం తెలుసుకున్న బంధువులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు. పూర్తి వివరాలు కోసం ఔట్ పోస్ట్ పోలీసులను సంప్రదించగా వివరాలు ఇవ్వడానికి నిరాకరించారు.

తాడివానిపాలెం వద్ద ఇద్దరికి గాయాలు

కొత్తవలస: మండలంలోని విశాఖ-అరకు రహదారిలో చింతలపాలెం శివారులోగల తాడివానిపాలెం కాటా వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సీఐ చంద్రశేఖర్, స్థానికుల కథనం మేరకు.. సరిపల్లి నుంచి ద్విచక్రవాహనంపై కొత్తవలస వస్తున్న మంగళపాలెం గ్రామానికి చెందిన పిల్లా విజయరామపాత్రుడు నడిచివెళ్తున్న అల్లాడ సిద్దును శుక్రవారం రాత్రి ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. ఆ ప్రాంతంలో చీకటిగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగింది. సంఘటన స్థలాన్ని సీఐ పరిశీలించారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత

విజయనగరం క్రైం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 40 మొబైల్ ఫోన్లను శనివారం సోషల్ మీడియా, సైబర్ సెల్ సీఐ విజయ్‌కుమార్ సైబర్ పోలీసు స్టేషన్‌లో బాధితులకు అందజేశారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు ఫిర్యాదులను ఆన్‌లైన్‌ద్వారా కానీ, నేరుగా సైబర్ పోలీసు స్టేషన్‌లో అందించవచ్చునని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్ఐలు ప్రశాంత్‌కుమార్, నసీమాబేగం, కానిస్టేబుళ్లు వాసుదేవ్, శ్రీనివాసరావు, రాజేష్, నాగమణి, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

అరుణాచలం అన్నదానం ట్రస్టు కార్యవర్గం ఏర్పాటు

బొబ్బిలి: అరుణాచలం క్షేత్రంలో శివమణికంఠ అన్నదానం ట్రస్టు నిర్వహణకు సంబంధించి జిల్లాలో కార్యవర్గం ఏర్పాటుచేసినట్లు ఆ ట్రస్టు వ్యవస్థాపకుడు అరుణాచల రుద్రాక్షస్వామి తెలిపారు. ఈమేరకు బొబ్బిలిలో శ్రీకళాభారతి ఆడిటోరియంలో శనివారం విలేకరులతో మాట్లాడారు.అరుణాచలంలో యాత్రికులకోసం 24 గంటలపాటు ఉచితవసతి, భోజనసదుపాయం కల్పించే యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈకార్యకలాపాల నిర్వహణకు జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడిగా దేవులపల్లి సన్యాసిరావును,అధ్యక్షుడిగా రెడ్డి దామోదరరావును, నియోజకవర్గ అధ్యక్ష,ఉపాధ్యక్షులుగా శంబంగి సునీత, సుజాత,కార్యదర్శిగా కొత్తా రవిని నియమించినట్లుచెప్పారు. కార్యక్రమంలో శ్రీకళాభారతి ప్రతినిధులు నంబియార్ వేణుగోపాలరావు, సత్యనారాయణ, పుల్లెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోటారు వాహనాలపై ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల భారం

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

తెర్లాం: జిల్లాలో ఈనెల 16న జరగనున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, మండల నాయకుడు ఎస్.గోపాల్ పిలుపునిచ్చారు. మండలంలోని పణుకువలస సెంటర్‌లో ఆటోకార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సొంత కాళ్లమీద బతుకుతున్న ఆటో కార్మికులను మోదీ, జగన్ ప్రభుత్వాలు దొంగదెబ్బలు తీస్తున్నాయని ఆరోపించారు. మోటారువాహనాలపై 700 నుంచి 15వేల వరకు ఫిట్‌నెస్‌సర్టిఫికెట్ భారం వైసీపీ ప్రభుత్వం భారం వేసిందన్నారు. ఈసర్టిఫికెట్ల ప్రక్రియ ప్రైవేటు వాళ్లకు ఇచ్చేయడానికి ప్రభుత్వం సిద్ధమైందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఐపీసీ సెక్షన్ 304(ఎ) మార్పులు చేసి రెండేళ్ల శిక్ష ఐదేళ్లకు పెంచిందన్నారు. ఇది డ్రైవర్ల మెడకు ఉరితాడు వంటిందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు పి.తిరుపతిరావు, ఎం.గణపతి ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి: వీసీ

విజయనగరం రూరల్: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ కె.వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. శనివారం జేఎన్‌టీయూలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలునాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రీన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, రాజేశ్వరరావు, రాజ్యలక్ష్మి, శ్రీకుమార్, గురునాథ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం సాధ్యం

రాజాం: పుస్తక పఠనం వల్ల విజ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధించవచ్చని జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, రాజాం రచయితల వేదిక సభ్యుడు కుదమ తిరుమలరావు తెలిపారు. శనివారం రాజాంలోని జీసీఎస్ఆర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డి విశ్వేశ్వరరావు, ఎ.లక్ష్మణరావు, జి.రాంబాబు పాల్గొన్నారు.

‘శంఖారావం’ విజయవంతం చేయండి

● తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు

ఉమ్మడి జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌బాబు నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమం విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం జిల్లాలో వేర్వేరు చోట్ల ఆ పార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. అలాగే శంఖారావం నిర్వహణపై కార్యకర్తలు, నాయకులతో చర్చించారు.

జగన్‌ను సాగనంపేందుకు ఎదురుచూపు: కళా

రాజాం: సీఎం జగన్‌రెడ్డిని సాగనంపేందుకు ఎప్పుడు ఎన్నికలు వస్తాయోనని సీఎం ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు తెలిపారు. జగన్ అరాచక, అటవిక పాలనపై లోకేశ్ ఆదివారం ఇచ్ఛాపురంలో శంఖారావం చేపడుతున్నారని చెప్పారు.శనివారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసు రెవెన్యూ వ్యవస్థలను జగన్ చేతిలో పెట్టుకుని, ప్రజలు, ప్రతి పక్షపార్టీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు సారా నిషేధిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు చేయలేదన్నారు.ఓట్ల కోసం వస్తే ప్రజలు, ప్రజలు తరుపున లోకేశ్ ప్రశ్నిస్తారన్నారు.

ప్రజలు విసుగెత్తి పోయారు: కోండ్రు



రాజాం: కోండ్రు

ప్రజలకు భరోసా కల్పించేందుకు లోకేశ్ శంఖారావానికి శ్రీకారం చుట్టారని రాజాం నియోజకవర్గ టీడీపీఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు విసుగెత్తిపోయారని తెలిపారు.రోజుకు మూడు నియో జకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. సీఎం జగన్ పాలనలో బాధితులుగా మారిన అన్ని వర్గాల ప్రజలకు యువగళం పాదయాత్ర ద్వారా నారా లోకేష్ భరోసా ఇచ్చారని చెప్పారు. జగన్ ప్రజాస్వామ్యంపై చేసిన దాడిని, వ్యవస్థల విధ్వంశాన్ని ఆపాలంటే యువతకే సాధ్యమని తెలిపారు. నాలుగు నెలల తొమ్మిది నెలలు పూర్తయినా జాబ్ క్యాలెండర్ విడుదలచేయలేని అసమర్థ సీఎం జగన్ అని దుయ్యబట్టారు.

వైసీపీ వైఫల్యాలు వివరిస్తాం: లలితకుమారి

శృంగవరపుకోట: శంఖారావం సభలో వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యకలాపాలు, వైఫలాలు ప్రజలకు వివరిస్తామని టీడీపీ ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. జగన్ అరాచకాలపై టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేష్ పూరించిన నాదమే శంఖారావమని చెప్పారు. శనివారం ఎస్.కోటలోని పుణ్యగిరి రోడ్డులోగల అన్న క్యాంటీన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని లక్కవరపుకోట మండలం సోంపురం కూడలిలో ఈనెల 17వ తేదీ ఉదయం 10గంటలకు శంఖారావం సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, పార్టీ పట్టణాధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, క్లస్టర్ ఇన్‌చార్జి కాపుగంటి వాసు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గన్ను బంగారమ్మ, బోనంగి జ్యోతి పాల్గొన్నారు.

14న బాడంగిలో...: బేబీనాయన

బొబ్బిలి: బాడంగిలో ఈనెల 14న నారా లోకేశ్ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పిలుపునిచ్చారు. బొబ్బిలి దర్బారు మహల్‌లో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, ముఖ్యులతో పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ సూపర్ -6 పార్టీ కార్యక్రమాలకు సంబంధించి లోకేశ్ సమక్షంలో సమీక్ష జరుగుతుందని, నియోజకవర్గ పనితీరు అగ్రభాగాన నిలిచేలా కార్యకర్తలు శ్రమించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసకరమైన పరిపాలన సాగిస్తున్న జగన్ ఎన్నికలకు సిద్ధమని హడావుడి చేస్తున్నారని, ఇక మన మెందుకు వెనక్కి తగ్గాలన్నారు. సమావేశంలో జనసేనరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరు బాబు, టీడీపీ నాయకులు పువ్వల శ్రీనివాసరావు, అల్లాడ భాస్కరరావు, చింతల రామకృష్ణ, మడక తిరుపతినాయుడు, తెంటు రవిబాబు, సింగిరెడ్డి భాస్కరరావు, నర్సుపల్లి వెంకటనాయుడు, వెంకటేష్, సుంకరి సాయిరమేష్, బొత్స అప్పలుగుంట, తాతబాబు పాల్గొన్నారు.



రాజాం: మాట్లాడుతున్న కళా వెంకటరావు



బొబ్బిలి: మాట్లాడుతున్న బేబీనాయన

రామతీర్థంలో సభా స్థలం పరిశీలన..

నెల్లిమర్ల: రామతీర్థంలో ఈనెల 16 లోకేష్ నిర్వహించే శంఖారావం సభాస్థలాన్ని శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, ఇచ్ఛాపురం పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, డెంకాడ మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ మండలాలు, నెల్లిమర్ల నగర పంచాయతీ పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు, బైరెడ్డి లీలావతి, పార్టీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, కార్యదర్శి ఆకిరి ప్రసాదరావు, గేదెల రాజారావు, కలిదిండి పాణిరాజు, లంక అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు అట్టాడ శ్రీధర్, దంగా భూలోక, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ, నెల్లిమర్ల ప్రధాన కార్యదర్శి గురాన చక్రధర్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పోతల రాజప్పన్న, యూనిట్ ఇన్‌చార్జిలు నల్లం శ్రీనివాసరావు, తాడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

లోకేష్ సభను విజయవంతం చేయాలి: దామసర్ల

నెల్లిమర్ల: లోకేష్ నిర్వహించే శంఖారావం సభను విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర టీడీపీ ఇన్‌చార్జి దామసర్ల సత్య కోరారు. శనివారం నెల్లిమర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇచ్ఛాపురం నెల్లిమర్ల సభలను విజయవంతం చేయాలన్నారు. టీడీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని, ముఖ్యమంత్రి జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

అధికార పార్టీకి చివరి రోజులు: కేఏ నాయుడు

జామి: లోకేష్ ఈనెల 16న పూరించే శంఖారావంతో అధికారపార్టీకి చివరిరోజులు అని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు అన్నారు. మండలంలోని భీమసింగి పార్టీ కార్యాలయంలో టీడీపీ మండలాధ్యక్షుడు స్వామినాయుడు ఆధ్వర్యంలో శంఖరావం కార్య క్రమంపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఈ సైకోను తరిమికొట్టి సైకిల్‌పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో కొత్తలి సూర్యారావు, పైడిరాజు, ముకుంద శ్రీను,వర్రి రమణ,బండారు జగన్నాథం, సత్యన్నారాయణ, వేణు, జగన్నాథం, అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అవినీతి తప్పా అభివృద్ధి లేదు..

గంట్యాడ: గజపతినగరం నియోజకవర్గంలో అవినీతి తప్పా అభివృద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టరు కేఏ నాయుడు ఆరోపించారు. గంట్యాడలో టీడీపీ నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే భూకబ్జాలకు పాల్పడుతున్నారని, రైతులను భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. రైతులు తమభూములు ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోవాలన్నా ఎమ్మెల్యే వద్దకు వెళ్లాల్సి వస్తోందని విమర్శించారు. పోలవరం లెఫ్ట్ కాలువ కొత్త డిజైన్ వల్ల రైతులకు చాలా నష్టం జరుగుతుందని, ఈ సమస్య ఈనెల 16న గంట్యాడకు రానున్న లోకేష్ దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. మూతపడిన భీమసింగ్ షుగర్ ఫ్యాక్టరీ విషయం ఆయనకు వివరిస్తామని చెప్పారు. మండలంలో జరిగే సభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోని టీడీపీ మండలాధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, నాయకులు గోపాలరాజు, బండారు బాలాజీ, లక్ష్మునాయుడు, అల్లు విజయకుమార్, రొంగళి కృష్ణ అట్టాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: సభ స్థలాన్ని పరిశీలిస్తున్న బంగార్రాజు, రవిశేఖర్



శృంగవరపుకోట: మాట్లాడుతున్న లలిత కుమారి



విజయనగరం రూరల్: నాలుగో డివిజన్‌లో భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రం అందజేస్తున్న అదితి గజపతిరాజు



కొత్తవలస: ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహిస్తున్న గొంప కృష్ణ

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకుల ప్రచారం

టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. శనివారం విజయనగరం, కొత్తవలస మండలం, ఎస్.కోటలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. బాండ్లు పంపిణీచేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలను వివరించారు. ప్రజలకు వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేశారు.

వైసీపీ పాలన అస్తవ్యస్తం: అదితి

విజయనగరం రూరల్: వైసీపీ పాలన అస్తవ్యస్తంగా మారిందని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు ఆరోపించారు. విజయనగరంలోని 4, 15 డివిజన్ల పరిధిలో మంగళవీధి, ఫూల్‌బాగ్ తదితర ప్రాంతాల్లో టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరలు నియంత్రించలేని అసమర్థ ప్రభుత్వమని ఆరోపించారు. ధరల స్థిరీకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని చెప్పినా,ఇంతవరకూ పైసా కూడా విదల్చలేదన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, నిత్యావసరాలు, కాయగూరలు ధరలు ఆకాశాన్నంటాయని ఆరోపించారు.ప్రసాదుల ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుఇవ్వాలన్నారు.కార్యక్రమంలో నాలుగోడివిజన్ టీడీపీ నాయకులు ఖండవిల్లి శేఖర్, బాబ్జీ, రఘుమండ శంకరావు, జన్యాల వెంకటరావు, 15వ డివిజన్ ఇన్‌చార్జిచోడిపల్లి రామరాజు, పిన్నింటి శ్రీనివాసరావు, పట్నాల వెంకటేష్ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే అధికారం: కోళ్ల

శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం- జనసేన కూటమిదే అధికారమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి తెలిపారు. శనివారం రాత్రి శృంగవరపుకోట పందిరప్పన్న కూడలిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలా ధ్యక్షుడు జీఎస్‌నాయుడు, నాయకులు కొణదం మల్లేశ్వరరావు, అనకాపల్లి చెల్లయ్య, కాపుగంటి వాసు, భీశెట్టి అరుణ, బోనంగి జ్యోతి, సుబ్బారావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజలకు మేలు: గొంప కృష్ణ

కొత్తవలస: టీడీపీ-జనసేన పార్టీలు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉంటుందని, సీఎంగా చంద్రబాబు ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ తెలిపారు. చింతలపాలెం నుంచి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. చింతలపాలెం, దేశపాత్రునిపాలెం, మంగళపాలెం, కొత్తవలస, రెల్లి, ముమ్మనవానిపాలెం, అప్పన్నదొరపాలెం, జోడుమెరక, కుమ్మరబంజరు, చింతలదిమ్మ, చినమన్నిపాలెం, గొల్లపేట, రాజన్నకాలనీ, అర్దానపాలెం, కొత్తసుంకరపాలెం,పాత సుంకరపాలెం, ఎర్రవానిపాలెం, కొత్తూరు, కంటకాపల్లి, కాటకాపల్లి,పెదరావుపల్లి, చినరావుపల్లి, బలిఘట్టాం గ్రామాలు మీదుగా ర్యాలీ సాగింది.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడుగొరపల్లి రాము, నాయకులు పి.జగ్గారావు, ఏడువాక రమణ, వల్లపు ఈశ్వరరావు, కంచిపాటివేణు,శ్రీరాములు,సూర్యనూకరాజు,కోటిగొరపల్లి అప్పలస్వామి పాల్గొన్నారు.

ఎస్.కోటలో ఆశా కార్యకర్తల ర్యాలీ



ఎస్.కోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

శృంగవరపుకోట: స్థానిక దేవీ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు శనివారం ఆశాకార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.కనీసవేతనం రూ.26 వేలుఇవ్వాలని, యాప్‌లను తగ్గించాలని, రెండో ఏఎన్ఎంలుగా తీసుకోవాలని, ఏఎన్ఎం పరీక్షల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు.విజయవాడ ధర్నాలో ఆశాకార్యకర్తలను అరెస్టు చేయడాన్ని తప్పుపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు, కె.శ్రీనివాసన్ డిమాండ్ చేశారు. శనివారం విజయనగరంలోని కోట జంక్షన్ సమీపంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, జీవో- 117ను తక్షణమే రద్దు చేయాలని కోరారు.

బొబ్బిలి విద్యార్థికి బేబీనాయన అభినందన

బొబ్బిలి: పట్టణానికి చెందిన విద్యార్థి కన్నూరు ప్రణీత్ శ్రీవత్సయోగానందనాయుడను స్థానిక దర్బారుమహల్‌లో శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు అభినందించారు. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదువుతున్న ప్రణీత్ శ్రీవత్సయోగానందనాయుడు ఇటీవల డిల్లీలో జరిగిన రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. యోగానందనాయుడు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

పాఠశాల భవనం ప్రారంభం

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి పంచాయతీలో గల శారదా మెటల్స్ కర్మాగారం ఆధ్వర్యంలో సీఎస్‌పీ నిధులు సుమారు 40 లక్షలతో నిర్మించిన పలు కార్యక్రమాలకు శనివారం ప్రారంభించారు. కొత్తవలస పంచాయతీ పాత సుంకరపాలెంలో స్కూల్‌భవనం, కంటకాపల్లి, కాటకాపల్లిలో నీటి పథకాల ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించినట్లు కర్మాగార ప్రతినిధి శంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండిశ్రీనివాసరావు, ఎంపీపీ గోపెమ్మ, సర్పంచ్‌లు మచ్చ యర్రయ్యారామస్వామి, మదిన అప్పల రమణ, పి.కృష్ణ, గొరపల్లి శివ, కర్మాగార యాజమాన్య ప్రతినిధులు ప్రమాత్ మోహన్, అనంత్ కుమార్, సన్యాసిరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

కలెక్టరేట్: ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జీవో-56 ద్వారా తీసుకొచ్చిన రెండేళ్ల అప్రంటీస్ విధానాన్ని రద్దుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు డిమాండ్‌చేశారు. శనివారం విజయనగరంలోని యూత్ హాస్టల్‌లో యూటీఎఫ్ కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయుల పోరాటం ఫలితంగా రద్దు చేసిన అప్రంటీస్ విధానాన్ని ప్రవేశ పెట్టడం సరికాదన్నారు. డీఎస్సీలో పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ ఓపీఎస్ అమలు చేయాలని ఓట్ పర్ ఓపీఎస్ నినాదంతో అన్ని పార్టీల నాయకత్వం పోస్ట్ కార్డు క్యాంపెయిన్ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలోని జిల్లా అధ్యక్షులు రమేష్ చంద్ర పట్నాయక్, సంఘ నాయకులు విజయగౌరి, మీసాల అప్పలనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహనరావు

డీఎస్పీగా శ్రీనివాసరావు

బొబ్బిలి: బొబ్బిలి డీఎస్పీగా పి.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీ శ్రీధర్‌కు శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీకావడంతో ఆయన స్థానంలో శ్రీనివాసరావు విధుల్లో చేరారు. సీఐ మలిరెడ్డి నాగేశ్వరావు, ఎస్ఐలు చదలవాడ సత్యనారాయణ, లోవరాజులు డీఎస్పీని కలుసుకున్నారు.

తాటిపాడులో ఎన్ఎస్ఎస్ సేవలు

రేగిడి: తాటిపాడులో రాజాం జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. రాజాం కేర్, శ్రీకాకుళం జెమ్స్‌ఆస్పత్రుల ఆధ్వర్యంలో 215 మందికి వైద్య సేవలందించారు. జీఎంఆర్ అసోసియేట్ డీన్ ఎంవీ నాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ వి.రాంబాబు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కేవీవీఎస్ ప్రసాద్, వైద్యులు ఉపేంద్ర, పీఏఎస్ బాబూరావు, జెమ్స్ ఏరియా మేనేజర్ అబ్రహం పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

రేగిడి: వాహనచోదకులు రహదారి భద్రతా నిబంధనలు పాటించకపోతేచర్యలుతప్పవని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు.సంకిలి ఉమ్మడిజిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శనివారం ఎస్ఐ వాహన తనిఖీలు నిర్వహించారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న, నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ‘పల్లెకు పోదాం’

లక్కవరపుకోట: కల్లేపల్లి, రేగ, మసివానిపాలెం, తామరాపల్లి, శ్రీరాంపురంల్లో బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించింది.పార్టీ మండలాధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ ఆధ్వర్యంలో విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, బూత్ కమిటీలను నియిమించారు. ఈమేరకు 52 బూత్‌ల్లో కమిటీలు వేసినట్టు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, అప్పారావు, టి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం

విజయనగరంరింగురోడ్డు: ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సచివాలయ అడ్మిన్, కార్యదర్శులకు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు.శనివారం విజయనగరం కార్పొరేషన్‌లోని 16, 31 వార్డుసచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిందన్నారు. మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించి లబ్ధిదారులకు పూర్తి హక్కులు లభించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు.

హైవే రైతులకు న్యాయం చేయండి

లక్కవరపుకోట: జాతీయరహదారి 516బీలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. శనివారం జమ్మాదేవిపేటలో నిర్వహించిన రైతుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు మాట్లాడారు. భూములు కోల్పోయిన రైతులను సంప్రదించకుండా ప్రభుత్వం పరిహారాన్ని నిర్ణయించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రజల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో డేగల అప్పలరాజు, కోటి పాల్గొన్నారు.

పీవీకి భారతరత్నపై హర్షం

విజయనగరం రింగురోడ్డు: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంపై రాష్ట్రీయ బ్రాహ్మణసంఘటన రాష్ట్రఉపాధ్యక్షుడు భోగాపురపు వాయు నందన శర్మ ఒక ప్రకటనలో హర్షం వక్తంచేశారు. తెలుగుజాతి ఆనందించదగిన విషయమని తెలిపారు. ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్థిక సరళీకరణ విధానాలు ప్రవేశపెట్టి ప్రపంచదేశాలతో పోటీ పడే స్థాయికి బీజం వేశారని తెలిపారు. సాహిత్యరంగంలో కూడా పట్టు సాధించిన మహావ్యక్తి పీవీ అని కొనియాడారు.

ఆధునికీకరణకు నోచుకోని 13వంతుల కాలువ

● రబీ, ఖరీఫ్‌లో కష్టాలు తప్పవంటున్న రైతన్నలు



ఇదీ 13వంతుల కాలువ పరిస్థితి

గజపతినగరం: మండ లంలోని 13 గ్రామాలకు సాగునీరు అందించే 13వంతుల కాలువ ఆధునికీకరణ పనులకు నోచుకోకపోవడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ కాలువ ద్వారా మండ లంలో ని సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాలువల్లో పూడికలు, తుప్పలు తొలగించకపోవడంతో పాటు గేట్లు పాడయ్యాయి. పాలకులు గానీ అధికారులు గానీ ఈ కాలువపై దృష్టి సారించడం లేదు. దీంతో రైతులకు రబీ, ఖరీఫ్ కాలంలో సాగునీరు కష్టాలు తప్పేటట్టు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చంపావతి నీటిని 13వంతుల కాలువకు మళ్లించేందుకు రైతులు ఇసుక బస్తాలతో కరకట్ట వేసి నీటిని తరలించేవారు. రైతుల కష్టాలను చూసి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంపావతి నీటిని 13 వంతుల కాలువకు మళ్లించే విధంగా రూ.కోటి 20లక్షలతో అప్పటి ఎమ్మెల్యే కేఏ నాయుడు నిధులు మంజూరు చేసి కిలో మీటరున్నర వరకు వాల్ నిర్మాణం చేపట్టారు. దీంతో చంపావతి నీరు ఈ కాలువ ద్వారా పంటపొలాలకు వెళ్తుంది. అయితే వైసీపీ పాలనలో ఐదేళ్లు కావస్తున్నా కాలువ పనులు, గేట్లు బాగు చేయకపో వడంతో సాగునీరు వృథా అవుతుందని పలువురు రైతులు అంటున్నారు. ముఖ్యంగా సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు జరగకపోవడంతో ఈ కాలువలను అధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని 13 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

టీడీపీలో చేరికలు

మెంటాడ: చింతలవలస గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వైసీపీకి చెందిన సుమారు 200మంది టీడీపీ చేరారు. వీరంతా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఆమె టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చీపురుపల్లి అభివృద్ధిపై మంత్రి సమీక్ష

చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణాభివృద్ధిపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని వర్తక సంఘ భవనంలో శనివారం జరిగిన ఈ సమీక్షలో ఆయన వార్డు కార్యదర్శులు, సిబ్బంది, వార్డు సభ్యులతో మా ట్లాడారు. పంచాయతీ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. పట్టణంలో పది రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. కాలువలు, సీసీ రోడ్లు, వీధి లైట్లు, తదితర వాటిపై సచివాలయ సిబ్బంది మూడు రోజుల్లో సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. స్థానిక సమస్యలపై వార్డు సభ్యుల నుంచి వినతి పత్రాలు స్వీకరించాలన్నారు. జీజీఎంపీ కార్యక్రమం కింద ఇప్పటికే రూ.కోటి మంజూరయ్యాయని, అవసరమైతే మరో రూ.కోటి మంజూరు చేస్తామని చెప్పారు. ఈ సమీక్షలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఆర్డీవో బి.శాంతి, డీపీవో శ్రీధర్ రాజా, ఎంపీడీవో డి.శ్వేత, తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

● **గుర్ల:** తెట్టంగి గ్రామంలో నిర్మించిన సచివాలయాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీపీ ప్రమీల, జడ్పీటీసీ అప్పలనాయుడు, కేవీ సూర్యనారాయణరాజు, సర్పంచ్ జమ్ము పార్వతి, స్వామినాయుడు, వైసీపీ మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అవగాహనతోనే వ్యాధులు దూరం

గరుగుబిల్లి: వ్యాధులు దరి చేరకుండా అవగాహన కల్పిస్తే వ్యాధులు దూరమ య్యే అవకాశం ఉంటుందని మండల వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో కుష్టు వ్యాధికి సంబం ధించి స్పర్శ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నివారణకు అవసరమైన మందులు సక్రమంగా వాడితే వ్యాధి నిర్మూలన అవుతుందన్నారు. చిలకలపల్లి డీపీఎంవో వై.బలరాంనాయుడు మాట్లాడుతూ గతంలో వ్యాధితో బాధపడుతున్న వారికి ఆయా గ్రామాల్లో స్పర్శ కార్యక్రమంలో భాగంగా శుభ్రత చేపడుతున్నామ న్నారు. ప్రత్యేక పర్యవేక్షణలో వ్యాధి నిర్మూలనపై అవసరమైన చర్యలు చేపడుతు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ దాసరి మృత్యుంజయరావు, హెచ్‌వీ కుమారి, ఏఎన్ఎం సుమతి, తదితరులు పాల్గొన్నారు.

అప్రంటీస్ విధానం రద్దు చేయాలి

● బహుజన టీచర్స్ అసోసియేషన్

పాలకొండ: ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి రద్దు చేయించిన అప్రంటీస్ విధానం పునరుద్ధరించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని బహుజన టీచర్స్ అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమార్, గొల్ల ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో శనివారం తెలి పారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మించి నమ్మిన వారిని ఇలా మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పి అది చేయకపోగా ఇప్పుడు మళ్లీ అప్రెంటీస్ విధానం తిరిగి తీసుకురావడం ప్రభుత్వం నియంతృత్వానికి పరాకాష్ట అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఉపాధ్యాయ పోస్టులను పెంచి అప్రెంటీస్ విధానం రద్దు చేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరారు.


మద్యం సీసాల స్వాధీనం

డెంకాడ: చింతలవలస 5వ పోలీసు బెటాలియన్ సమీపంలో శనివారం ధర్మపురి గ్రామానికి చెందిన గొలగాని నరసింగరావు నుంచి 51 మద్యం సీసాలను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామాలలో అక్రమ మద్యం విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'రానున్న ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలి'

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం ఉత్తరాంధ్రలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమకు టికెట్లు ఆయా రాజకీయ పార్టీలు కేటాయిం చక పోతే వ్యతిరేకంగా ప్రచారం చేసి ఓడిస్తామని ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు తాత్రాజు రాజారావు, పతివాడ కృష్ణవేణి, ఎజ్జపు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం విజయనగరంలో సంఘం ప్రతినిధులు విలేకరుల తో మాట్లాడుతూ నెల్లిమర్ల, చీపురుపల్లి, విజయనగరం, గజపతినగరం అసెంబ్లీ సీట్లు కేటాయించాలని కోరారు. త్వరలో విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. బతుకు తెరువుకోసం ఇతర ప్రాంతాలలకు వెళ్లేవారికి ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బెల్లాన సంతోష్, సానుబిల్లి రామునాయుడు, డాక్టర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు హోమియో సేవలు



వైద్యాధికారి రమేష్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

డెంకాడ: జొన్నాడ పంచాయతీ మన్యాలపేటలో కిడ్నీ బాధితుల కోసం శనివారం హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో తర్లువాడ హోమియో వైద్యాధికారి రమేష్ రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. టీడీపీ భోగాపురం మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, నాగరాజు, మాజీ ఎంపీటీసీ కోరాడ రమేష్, మాజీ సర్పంచ్ సారిక అప్పారావు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

సాలూరు: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని పట్టణ సీఐ జీడీ బాబు అన్నారు. పట్టణంలోని పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసాయిసూర్య పాఠశాలలో శనివారం ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన పరీక్ష పత్రాన్ని విడుదల చేశారు.

లోకేష్ పర్యటనను జయప్రదం చేయండి

● పార్వతీపురం మన్యంలో 13 నుంచి 'శంఖారావం'

● జన సమీకరణకు పార్టీ నాయకుల సమాయత్తం



సాలూరు: మాట్లాడుతున్న సంధ్యారాణి



గరుగుబిల్లి: సభా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జగదీశ్వరి

సాలూరు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు ఈనెల 11 నుంచి ఉత్తరాంధ్రలో నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ప్రారంభం కానున్న శంఖారావం యాత్ర ప్రతిరోజూ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాగుతుందని తెలిపారు. రూట్ మ్యాప్ ప్రకారం ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం లోకేష్ ఆయా నియోజక కేంద్రాలకు వెళ్లి కేడర్‌తో సమావేశం అవుతారని చెప్పారు. శంఖారావం సభకు జనసమీకరణ చేసి, విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు తిరుపతిరావు, ప్రసాదరావు, వేణు, పరమేష్, కౌన్సిలర్ హర్ష, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో షెడ్యూల్ ఇలా..

ఫిబ్రవరి 13 ఉదయం 10 గంటలకు పాతపట్నం, మధ్యాహ్నం రెండు గంటలకు పాలకొండ, సాయంత్రం 5:30కు కురుపాం, ఫిబ్రవరి 14న ఉదయం 10 గంటలకు పార్వతీపురం, మధ్యాహ్నం 2 గంటలకు సాలూరులో, సాయంత్రం 5:30కు బొబ్బిలి నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

సభా స్థలం పరిశీలన

గరుగుబిల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న శంఖారావం కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి కోరారు. శనివారం ఉల్లిభద్ర సముదాయంలోని ఎర్రన్నగుడి ఆవరణలో ఆమె కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లోకేష్ ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా ఈనెల 13న సాయంత్రం 5 గంటలకు ఉల్లిభద్ర ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం బహిరంగ సభను నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, డొంకాడ రామకృష్ణ, పి.సుదర్శనరావు, ఎంటీ విజయవాంకుశం, కె.భరత్‌కుమార్, ఎం.సింహాచలంనాయుడు, ఎ.తవిటినాయుడు, పి.పూర్ణచంద్రరావు, వై.శ్రీనివాసరావు, ఎ.గంగాదర్‌నాయుడు, ఎస్.మధుసూదనరావు, ఎం.నారాయణస్వామి, జి.లక్ష్మంనాయుడు, ఎం.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి అరాచకాలపై పూరించిన నాదమే..

గుమ్మలక్ష్మీపురం: జగన్మోహన్‌రెడ్డి అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన నాదమే శంఖారావమని పార్టీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మ లక్ష్మీపురంలోని తన స్వగృహంలో శనివారం ఆమె టీడీపీ, జనసేన నాయకు లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 13న గరుగుబిల్లి మండలం ఉల్లిభ ద్ర వద్ద బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశం లో జనసేన ఇన్‌చార్జి కడ్రక మల్లేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు అనుమతివ్వాలని...



డీఎస్పీకి విజ్ఞాపన పత్రాన్ని అందిస్తున్న పార్టీ నాయకులు

పాలకొండ: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 13న పాలకొం డ పట్టణంలోని గజాలఖానా వద్ద నిర్వహించనున్న బహిరంగ సభకు పార్టీ నాయకులు డీఎస్పీ జీవీ కృష్ణారావుకు శనివారం అనుమతి కోరారు. ఈ మేరకు ఒక విజ్ఞాపన పత్రాన్ని అం దించారు. డీఎస్పీని కలిసిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుంకరి అనీల్, అంపోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవన విధానంలో మార్పుతోనే అభివృద్ధి సాధ్యం

● హ్యూమన్ రిసోర్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా



మాట్లాడుతున్న ఆర్పీ సిసోడియా

గరుగుబిల్లి: జీవన విధానంలో మార్పుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీ హ్యూమన్ రిసోర్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ ఆర్పీ సిసోడియా అన్నారు. శనివారం తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో సుస్థిర జీడి తోటలు, అంతర్ పంటలు, మహిళా సంఘాల సమన్వయంపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సమావేశానికి సంస్థ వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిసోడియా మాట్లాడుతూ ప్రస్తుత తరుణం లో సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే ప్రకృతి వ్యవసాయ విధానాలే శరణ్యమన్నారు. నాబార్డు డీడీఎం టి.నాగార్జున, ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముఖరావు.. గతంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో జీడిరైతులు సమాఖ్య తరపున సిసోడియాకు మన్య దీపధారి అవార్డును ప్రదానం చేశారు. అలాగే జీడి సాగు విధి విధానాలపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. గిరిజన ప్రాంతాల్లో జీడి పంటలు సాగుతో అభివృద్ధి చెందిన పలువురు రైతులకు ఆర్పీ జీడి రత్న అవార్డులను సిసోడియా అందించారు. అలాగే శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించా రు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ నీలకంఠం, ఆర్‌వైఎస్ఎస్ సలహాదారు కె.రమాప్రభ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజు, సినీ గేయ రచయిత, బడి నుంచి పొలంకి సలహాదారు శివాజీ, మంచాల పారమ్మ, డి.ధనుంజయరావు, డీటీ పి.సత్యలక్ష్మికుమార్, ఆర్ మండంగి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సిసోడియా

తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని సిసోడియా శనివారం దర్శించుకు న్నారు. ఈసందర్భంగా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, అర్చకుడు వీవీ అప్పలా చార్యులు, ఛైర్మన్ ఎం.సత్యనారాయణ ఆయనకు స్వాగతం పలికారు. ఈసంద ర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాను నాటిన జీడితోటలు చూసి మురిసిపోయారు

కురుపాం: పార్వతీపురం ఐటీడీఏ ప్రాంతంలోని గిరిజన రైతులు జీడి తోటల ద్వారా గణనీయమైన ఆదాయం పొందడం ఎంతో సంతోషంగా ఉందని ఏపీ హ్యూమన్ రిసోర్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ ఆర్పీ సిసోడియా ఆనందం వ్యక్తం చేశారు. గతంలో పార్వతీపురం ఐటీడీఏ పీవోగా పనిచేసిన సిసోడియా ప్రస్తుతం స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదాలో కురుపాం మండలం టేకరిఖండి గ్రామాన్ని సందర్శించారు. 20 ఏళ్ల కిందట తాను ఐటీడీఏ పీవోగా ఉన్నప్పుడు 25 వేల ఎకరాల్లో జీడి తోటలు వేయించగా ప్రస్తుతం అవి ఏ స్థితిలో ఉన్నాయి వాటి ద్వారా ఎంత ఆదాయం పొందుతున్నారని టేకరిఖండి గిరిజనులకు అడిగి తెలుసుకున్నారు. రెండు ఎకరాలకు లక్షన్నర రూపాయలు ఆదాయం పొందుతున్నామని, జీడి తోటలు తమ జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకు వచ్చాయని గిరిజన రైతులు చెప్పారు. ఆయన వెంట జట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు డి.పారినాయుడు, ఐటీడీఏ వ్యవసాయశా ఖ అధికారి షణ్ముకరావు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్

● విజయవంతం చేయాలని వివిధ సంఘాలు, వామపక్ష నాయకుల పిలుపు



సాలూరు: మాట్లాడుతున్న సీఐటీయూ నేత వెంకటరావు

భామిని: కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక రంగాలపై చూపుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 16న చేపడుతున్న గ్రామీణబంద్, సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం సమావేశం నిర్వహించారు. సం ఘం గౌరవాధ్యక్షుడు భోగారపురపు అప్పలనాయుడు, గురుబిల్లి లక్ష్మీపతినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ కార్పొ రేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో భోజపు చం ద్రశేఖర్‌నాయుడు, దారపు వాసుదేవరావు, దారపు రవినాయుడు, గురుబిల్లి సురేష్‌నా యుడు, కుప్పిలి రవీంద్ర పాల్గొన్నారు. ● **సాలూరు:** ఈనెల 16న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మిక, కర్షక, రైతుబందును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకుడు టి.వెంకటరావు కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాల యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగం, ఆకలి చావు లు పెరిగిపోవటానికి కేవలం పదేళ్ల గా అధికారంలో ఉన్న బీజేపీయే కారణమని అన్నారు. ఈనెల 16న దేశ వ్యాప్తంగా జరగనున్న రైతు బందు కార్యక్రమంలో ప్రతిఒ క్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్‌వై.నాయుడు, సింహాచలం, మల్లేష్, ఇందూ, నిర్మల, శ్రీదేవి పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** కార్పొరేట్ దత్తత విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న జరగనున్న భారత్ బంద్‌కు అందరూ సహకరించాలని సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు కోరారు. ఆయన సన్యాసిరాజుపేట, పెద్దవలస, భరణికివలసల్లో శనివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు వ్యతిరేక విధానాలను అవలభిస్తుందన్నారు.

వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి

సీతానగరం: పిల్లలను వ్యాధుల బారి నుంచి రక్షించాలంటే టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలని డీఎంవో టి.జగన్మోహన్‌రావు అన్నారు. మండలంలోని నీలకంఠాపురం, గుచ్చిమి గ్రామాల్లో నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. టీకాల వివరాలు ఉండే రికార్డులను పరిశీలించారు. ప్రతి టీకా ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. టీకా వివరాలు అదేరోజు ఆన్‌లైన్ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల ఆరోగ్య విషయమై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మిర్తివలసలో 'పల్లెకు పోదాం'

పాచిపెంట/సాలూరు: దేశంలో ప్రతి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు అందాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట అప్పలనాయుడు తెలిపారు. పాచిపెంట మండలం మిర్తివలస గ్రామంలో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర పథకాలపై ప్రచురించిన క్యాలండర్లను పంపిణీ చేశారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తా

గరుగుబిల్లి: గరుగుబిల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలోని రైతులకు మెరుగైన సేవలందిస్తామని ఛైర్మన్ బొబ్బిలి వెంకట దామోదర్ తెలిపారు. శనివారం ఆయన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాల యంలో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ పీఏసీఎస్ నుంచి అర్హత పొందిన రైతులకు రుణాలు, అలాగే ఎరువులు, తదితర వాటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు. సంఘాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, సర్పంచ్ కె.ఇందుమతి, ఎస్.జనార్ధనరా వు, సీఈవో ఎస్.గుంపస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ప్రతినిధుల సెమినార్

బొబ్బిలి: స్థానిక టీబీఆర్ కన్వెన్షన్‌లో అంతర్జాతీయ రోటరీ సంస్థకు చెందిన ఆరు జిల్లాల ప్రతినిధుల రెండు రోజుల సెమినార్ శనివారం ప్రారంభమైంది. రోటరీ డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమాన్ని పీడీజీ రామేష్ ప్రారంభించారు. రోటరీక్లబ్ బొబ్బిలి అధ్యక్షుడు జేసీ రాజు, రీజినల్ కార్యదర్శి తూముల కార్తీక్ పర్యవేక్షణలో జరిగినకార్యక్రమంలో పీడీజీ భాస్కరరామ్, రామా రావు, కిశోర్‌కుమార్, వీరభద్రారెడ్డి, పూసా విశ్వనాథ్, స్థానిక రోటరీ ప్రతినిధులు గెంబలి శ్రీనివాసరావు, చంద్రకిశోర్, శ్రీహరి, ప్రవీణ్, శ్రీనివాసన్, శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ స్వామి ఆలయం ప్రారంభం

లక్కవరపుకోట: శ్రీరాంపురంలో గ్రామస్థులు నిర్మించిన అభయాంజనేయ ఆల య ప్రారంభోత్సవం ఆదివారం జరగ నుంది. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్నట్టు గ్రామ పెద్దలు తెలి పారు. పూజా కార్యక్రమం అనంతరం అన్న సమారాధన చేయనున్నట్టు తెలిపారు. ప్రారంభోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

రహదారి భద్రతలో భాగస్వాములు కావాలి

పార్వతీపురం టౌన్: రహదారి భద్రత కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వా ములు కావాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజా రవాణా అధికారి పి.సుధాకర్ కోరారు. శనివారం రహదారి మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు ప్రయాణికులను తమ గమ్యస్థానాలను చేర్చడంతో రహదారి భద్రత నిబంధనలు పాటించాలన్నారు. అలాగే మాసోత్సవాల్లో భాగంగా జిల్లా ఆసుపత్రిల్లో జరిగిన రక్తదాన శిబిరంలో ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దుర్గాతో పాటు ఈయూ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా రామవరం సర్పంచ్

సీతానగరం: టీడీపీ మండల అధ్యక్షుడిగా రామవరం సర్పంచ్ పెంట సత్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్వతీపురంలో టీడీపీ కార్యాలయంలో శనివారం సీతానగరం మండలానికి చెందిన పార్టీ నాయకులతో నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామవరం సర్పంచ్ పెంట సత్యంను పార్టీ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వాకాడ పారినాయుడు, శంబాన శ్రీనివాసరావులను నియమించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాల్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో స్ప్రేయింగ్



సిబ్బందికి స్ప్రేయింగ్ పై సూచనలిస్తున్న డీఎంవో

కొమరాడ: మండలంలోని పలు గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ నిర్వహించామని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) టి.జగన్మోహనరావు తెలిపారు. పెదఖేర్జిల వసతి గృహంలో చేపడుతున్న స్ప్రేయింగ్ కార్యక్రమా న్ని ఆయన శనివారం పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉలిపిరి, కొమరాడ, పెదఖేర్జిల వసతి గృహాల్లో దోమల మందు పిచికారీని వైద్య సిబ్బంది చేపట్టారన్నారు. విద్యా ర్థులు జ్వరాలబారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఫోకల్ స్ప్రేయింగ్ చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడి పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, హెచ్‌ఎం వెంకట రావు, సబ్ యూనిట్ అధికారి సీహెచ్ ధనుంజయరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

క్లుప్తంగా..

టీడీపీతోనే బీసీలకు న్యాయం

సీతానగరం: టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయ చంద్ర అన్నారు. గుచ్చిమి గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బొమ్మినాయిని లక్ష్మణరావు, బూత్ ఇన్‌చార్జి చిరంజీవి, రౌతు వేణుగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు అక్షర నివాళి



పీవీ రూపంలో కుర్చున్న విద్యార్థులు

సాలూరు రూరల్: మాజీ ప్రధాని పీవీ నరసింహారా వుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన సంద ర్భంగా సాలూరులో సామాజిక కార్యకర్త కోడూరు సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. విద్యార్థులంతా కలిసి పీవీ అనే అక్షర రూపంలో కూర్చుని నివాళులు అర్పించారు.

పైపులైన్లకు మరమ్మతులు



పైపులైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

వీరఘట్టం: మేజర్ పంచా యతీలోని తాగు నీటి పైపులైన్లకు అధికారులు శని వారం మరమ్మ తులు చేపట్టారు. తాగునీటి కష్టాలు తీర్చాలి అనే శీర్షికకు శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన పైపులైన్లకు మరమ్మ తులు చేపట్టారు. ఈ మేరకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సచివాలయం ప్రారంభం

సీతానగరం: నిడగల్లు గ్రామంలో నూతనంగా నిర్మిం చిన సచివాలయ భవనాన్ని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో వైసీపీ మండల నాయకులు బొంగురాజు, బలత శ్రీరాము, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకోండి

చీపురుపల్లి: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకోవాలని ఆశయ ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డి రమణ సూ చించారు. మొబైల్ బుక్ లైబ్రరీ కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం పట్టణంలోని బాలికలు, బాలుర వసతి గృహాల్లో పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఆశయ సభ్యులు కిశోర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.